

"మీ ఆఫీసులో అమ్మాయిలు కూడా పనిచేస్తుంటారా" అంది గిరిజ.

చేతిలోవున్న వారపత్రిక నుంచి దృష్టి ఆమె వైపుకు మరల్చాను

ఆమె నా ముఖంలోకి తదేకంగా చూస్తోంది.

"అవును" అన్నాను నేను తిరిగి పత్రికలోకి చూస్తూ.

ఇప్పుడు నా మనస్సు పత్రికలమీద లగ్నం కావటంలేదు గిరిజ ఆ ప్రశ్న అడగటంలో అంతర్యం ఏమిటా? అని ఆలోచించసాగాను.

ఎంతకీ అంతుపట్టలేదు.

అసలు ఆ మాటకొస్తే ఆమె నాకు అర్థం అయింది చాలా తక్కువని చెప్పాలి. మా ఇద్దరికీ పెళ్లి అయి మూడు నెలలు మాత్రమే అయింది; ఈ హైదరాబాదు మహా నగరంలో కొత్త కాపురం పెట్టింది రెండు నెలల కిందట.

ఈ రెండు నెలల కాలంలో ఆమెను అర్థంచేసుకోగలిగేంత సాన్నిహిత్యం మా మధ్య ఇంకా ఏర్పడలేదు. కలిసి తింటూ కలిసి జీవిస్తున్నా, ఆమెతో సహచర్యం పాతబడ లేదు.

"ఎంతమంది వున్నారు?"

మనసులోనే లెక్కించి—

"ఓ ఇరవై మంది వుంటారు"అన్నాను.

"వాళ్ళంతా మీతో మాట్లాడుతారా?"

"మాట్లాడుతారు."

"ఏం మాటా డుకుంటారు?"

క్షణంసేపు నా మనసు కలవరపడింది. తెలియని విషయాలు ఆసక్తితో తెలుసు కుందామని అడిగినట్టుగా కాకుండా, నేర విచారణలో నిందితుడిని,పోలీసులు ప్రశ్నిస్తున్న తీరులా వుంది.

ఆమె ఇంకా నా జవాబు కోసం ఎదురు చూస్తోంది.

నా జవాబు ఆలస్యం అయితే ఏమవు తుందో అన్న భయం కలిగింది నాలో.

"ఏవో ఆఫీసుకు సంబంధించిన విషయాలు సందర్భానుసారంగా మాట్లాడు కుంటాము" అన్నాను.

నాకు తెలియకుండానే నా కంఠంలో విసుగు ధ్వనించినట్లుంది. ఆమె సంభాషణ అంతటితో విరమించింది.

గిరిజ పుట్టి పెరిగింది ఓ సాధారణమైన పల్లెటూరులో. స్వంత వూరులోనే హైస్కూలు చదువు ముగించింది.

* * *

"ఇవాళ మరీ ఆలస్యంగా వచ్చారు" అంది గిరిజ తలుపులు తెరుస్తూనే.

చేతి గడియారం చూసుకున్నాను.

రాత్రి పది దాటింది.

"ఆఫీసులో ఇనస్పెక్షను దగ్గర పడు తూంది. పని వత్తిడి ఎక్కువగా వుంటోంది" అన్నాను.

స్నానం ముగించుకుని వచ్చేసరికి గిరిజ టేబుల్‌పై భోజనం సిద్ధం చేసింది.

"ఇంత రాత్రి వరకు పనిచేస్తే ఆరోగ్యం చెడిపోతుంది"అంది గిరిజ అన్నం వడ్డిస్తూ.

ఆమెకు నాపట గల శ్రద్ధకి, ప్రేమకి క్షణంసేపు పరవశించి పోయాను

పెళ్ళి కాకముందు ఆఫీసునుంచి ఇలాగే ఆలస్యంగా వచ్చి, అప్పుడు ఇక వండుకోలేక హోటలులో తినలేక, బ్రెడ్ ముక్కలు తిని కాలక్షేపం చేసిన రోజులు వున్నాయి.

అప్పటికి ఇప్పటికి ఎంత తేడా!

ఒక మనిషి మరో మనిషి జీవితంలో ఇంత మార్పు తీసుకురాగలదని ఇప్పుడిప్పుడే గ్రహించగలుగుతున్నాను

"పని ఎక్కువగా వున్నప్పుడు ఇలా ఓవర్ టైంవర్కు చేయటం మాకు మామూలే" అన్నాను, ఇదేమంత ఆందోళన చెందవలసిన విషయం కాదు అన్నట్టుగా.

"ఇంతకు ముందు సంగతి వేరు. కానీ మీకు ఏమన్నా అయితే నేను భరించలేను."

ఆమెకు నాకు బంధం ఏర్పడి మూడు నెలలు మాత్రమే అయింది అయినా ఆమెతో మూడు యుగాలుగా కలిసి వున్నట్టు అనిపించింది.

గిరిజ అందంతోపాటు, ఆమె మంచి మనసు కూడా నాకోసమే అన్న భావం నాలో చెప్పలేని ఆనందానికి కారణం అయింది.

వేడివేడి భోజనంతో కడుపు నిండి పోయింది.

ఆమె ఆదరణతో నా మనసుకు తృప్తిగా వుంది

హృదయంలో తెలియని మధుర స్పందన.

మనసులో ఉత్సాహం అనుభూతికి రాసాగాయి.

"అయితే ఇంత రాత్రి వరకూ మీ ఆఫీసులో అమ్మాయిలు కూడా పనిచేస్తారా" అంది గిరిజ నా అరచేతిలో వక్క పలుకులు వుంచుతూ.

ఆకాశంలో విహరిస్తున్న నాకు పట్టుతప్పి నేలమీద పడ్డట్టు అనిపించింది.

క్షణంసేపు బలవంతాన నా శరీరంలోకి సూదిమందు ఎక్కిచ్చినట్టుగా గిలగిలలాడి పోయాను.

ఏమని చెబితే ఎలా పరిణమిస్తుందో తెలియక మరోవైపుకి చూస్తూ వుండి పోయాను.

* * *

గిరిజకు నాపై నమ్మకం లేదు.

నన్ను నమ్మకూడనంతటి గ్రంథసాంగుడను కాదు నేను.

నాకు నేను శ్రీరామ చంద్రుడితో పోల్చు కుంటె అతిశయోక్తి అవుతుందేమో కానీ, చెడిపోయిన మనిషిని మాత్రం కాదు. కట్టు కున్న భార్యను కాదని, బయటి సుఖం కోసం ప్రాకులాడే లేకితనం నాలో లేదు అంతటి ధైర్యం కూడా లేదు.

అయితే నేను మంచి వాడిని అని నాకు నేను ఎలా చెప్పుకోవాలో తెలియటం లేదు.

ఆ మాట కొస్తే ఇంతవరకూ ఆమె ఒక్కసారి కూడా నిలదీసి నన్ను అడగలేదు.

తన మనసులో వుద్దేశ్యం సూటిగా బయట పెట్టకుండా, దాదాపు ప్రతిరోజూ ఏదో రకంగా తన అనుమానం వ్యక్తపరుస్తూ నన్ను ప్రతిరోజూ మానసికంగా నరకానికి గురి చేస్తోంది

ఆమె పట్ల నాకుండవలసిన మోజు, ప్రేమ, ఆరాధన తగ్గిపోయి క్రమంగా నా మనసులో ఆమెపై అసహ్యం, నిరాదరణ పెరగ సాగింది.

మా ఇద్దరి మధ్య దూరం పెరిగి పోతూంది.అయితే ఆమెకు నాపై అనుమానం ఎందుకు కలిగిందో,ఎంత ఆలోచించినా అంతు పట్టలేదు.

నా వయసుకు తగిన లోకానుభవం దృష్టిలో వుంచుకుని, ఒక భర్త తన భార్య పట్ల ప్రవర్తించ వలసిన తీరులో తేడా రాకుండా జాగ్రత్త పడుతూనే వచ్చాను.

* * *

ఆఫీసులో ఇనస్పెక్షను అయిపోయింది.

నెల రోజులుగా అధిక శ్రమ చేసిన శరీరానికి విశ్రాంతి అవసరం అనిపించింది. ఆఫీసుకు సెలవు పెట్టాను.

అదే విషయం గిరిజతో అంటే ఆమె చాలా సంతోషించింది

ఉదయం నుంచీ హడావిడిగా నాకు ఇష్టమైన వంటకాలు వండి పండగ వచ్చి నంత సంబరం చేసింది.

సాయంత్రం టాంక్ బండ్ మీదకి షికారు వెళ్ళాము.

చేతిలో చెయ్యి వేసుకుని, భుజాలు రాసు కుంటూ సాయంత్రపు చల్లగాలిలో అడుగులు వేస్తుంటే-

" జీవితమే మధురాను రాగం " అన్న సత్యం అనుభవంలోకి రాసాగింది.

"రైలులో లేడీస్ కంపార్టు మెంట్సు వుంటాయి కదా !"

"అవును" అన్నాను నేను.

"అలాగే బస్సులో లేడీస్‌కి విడిగా సీట్లు వుంటాయి"

"నిజమే"

"కేవలం ఆడపిల్లల కోసం ప్రత్యేకమైన కాలేజీలు కూడా వుంటాయి."

"అవును వుంటాయి."


"అలాంటప్పుడు ఉద్యోగం చేసే ఆడవాళ్ళ కోసం ప్రత్యేకంగా ఆడవాళ్ళ ఆఫీసులు ఎందు కుండవు ?"

ఆమె అడిగిందానికి జవాబు ఎలా చెప్పాలో అర్థం కాలేదు. ఆమె మనసులో ఏముందో అర్థం అయింతరువాత నేను కొయ్యబారి పోయ్యాను.

నేను ఆమె ముఖంలోకి చూడలేక నీళ్ళల్లోకి చూడ సాగాను.

నా జవాబు కోసం ఆమె రెట్టించ లేదు.

నా మూడ్ చెడిపోయింది. మనస్సు



వికలం అయిపోయింది. ఆ సమయంలో గిరిజ నన్ను నరకయాతన పెట్టటం కోసం వచ్చిన రాక్షసిలా అగుపించింది. ఆ రాక్షసి బారి మంచి తప్పించుకోవాలంటే, ఆమెను బలవంతాన నీళ్లలోకి తోసి హత్య చేయటం ఒకటే మార్గం అన్నంత ఆవేశం కలిగింది.

కానీ తేరుకున్నాను.

ఆమె తన మనసులోని అనుమానం పైకి చెప్పకుండా ఎలా జాగ్రత్త పడుతూందో, అలాగే నా మనసులోని భావాలు బయట పడ నీయ లేదు.

* * *

రోజులు భారంగా గడుస్తున్నాయి.

గిరిజకు నాపై నమ్మకం మరింత తగ్గి పోయింది.

ఆ విషయం ఆమె తన మాటలతో పరోక్షంగా వ్యక్త పరుస్తూనే వుంది.

ఆమెకీ నాకూ మధ్య మానసికంగా అగాధం ఏర్పడి పోయింది.

పరవగాహన లేని కారణంగా, జీవితం దుర్భరం అయిపోయి నేను పెళ్ళికి ముందు వూహించుకున్న జీవితం తారుమారు అయిపోయింది.

ఇప్పుడు నా జీవితంలో జీవం లేదు.

బ్రతుకులో థ్రిల్ లేదు.

మేము బాహాటంగా, ఘోరంగా పోట్లాడు కున్నది లేదు కానీ ఆమె అనుక్షణం, నన్ను కట్టుకున్న భార్యను వంచించే మోసగాడిగా, నేను ఆమెను ఏ క్షణంలోనైనా నడి సముద్రంలో ముంచెయ్యవచ్చన్న భయంతో అనుక్షణం జాగ్రత్త పడుతున్నట్టుగా ప్రవర్తిస్తూంది.

అయితే ఆమెలో ఈ ధోరణి ఎలా డెవలప్ అయిందో తెలియదు.

అయితే ఆమెకు వివేకం చెప్పి మా ఇద్దరి సంసారం కూలిపోకుండా కాపాడే మనిషి ఎవరైనా వుంటె బాగుండుననిపించింది.


ఈ మహా నగరంలో నా సమస్యను విడమరిచి చెప్పకోవటానికి దగ్గర బంధువులు లేరు.

ఏంచేయాలో తెలియని స్థితిలో ఉండగా—

గిరిజ తల్లి, కూతురు కాపురం ఎలా వుందో చూడటం కోసం రెండు రోజుల్లో వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది. గిరిజకు తండ్రి లేడు.

ఆ వుత్తరం చూసింతరువాత నాఆరాటం కొంత తగ్గింది. నా సమస్యకి పరిష్కారం లభించినట్లయింది.

గిరిజ తల్లి వచ్చింతరువాత వీలు చూసుకుని విషయం అంతా చెప్పి, కూతురుకి బుద్ధి చెప్పమంటే సరిపోతుంది అనుకున్నాను. అసలు గిరిజ స్వభావం అర్థంచేసుకుని, ఆమె వక్రబుద్ధి సరిచేయగల వ్యక్తి ఆమె ఒక్కతే అనిపించింది.




మా అత్తగారు వచ్చి అప్పుడే ఇరవై అయిదు రోజులు గడిచిపోయింది

ఆమెతో ఏకాంతంగా మాట్లాడటానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.

రాత్రి పన్నెండు దాటినట్లుంది. ఎందుకో మెలకువ వచ్చింది నా ప్రక్కన గిరిజలేదు.

ప్రక్క గదిలో తల్లీ కూతుళ్లు గుసగుస లాడుతున్న శబ్దం వినపడుతూంది

తల్లీ కూతుళ్ళు రహస్యంగా చెప్పకో వలసినవి ఏముంటాయి? ఒకవేళ నాకంటే ముందుగా గిరిజ తల్లికి నాపై నూరి పోస్తూందేమో! అనిపించింది.

చెవి ఒగ్గి వినసాగాను—

"నువ్వు ఎన్ని అయినా చెప్పు, మగవాళ్లను నమ్మకూడదు!"

అది మా అత్తగారి గొంతు.

"ఆయన అలాంటి వారు కాదమ్మా. ఈ నాలుగు నెలల నుంచీ ఆయన్ని గమనిస్తూనే వున్నాను."

"నువ్వొక పిచ్చి మొద్దువి. నీకు తెలిసేలా చేస్తారా ఏమిటి? ఆడపిల్లల మధ్య కలిసి పనిచేసే మనిషి మడికట్టుకు కూర్చుంటాడా? అందులో ఉద్యోగం చేసే ఆడవాళ్ళు మరీ తెగించి వుంటారు."

"కానీ ఆయన చాలా మంచి మనిషి. నన్ను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు."

"ఇంట్లో వున్నప్పుడు మొగవాళ్ళు అలాగే నటిస్తుంటారు. గడప దాటింతరువాత కట్టుకున్న పెళ్లాం గుర్తు వుండదు. కాబట్టి మనమే మొగాడిని కట్టి పడేసుకోవాలి."

గిరిజ నా తరఫున ఇంకా వాదిస్తూనే వుంది.

మధురానుభూతులతో తన్మయత్వం చెందవలసిన మా తొలి జీవితం దుస్వప్నంలా మారిపోవటానికి పరోక్షంగా కారణమైన మా అత్తగారిని వెంటనే బయటకు గెంటివెయ్యా లన్నంత కోపం వచ్చింది.

కానీ అంతలోనే ఆమెపై అంతులేని జాలి కలిగింది.

తన కూతురి జీవితం పది కాలాలపాటు పదిలంగా వుండాలని తనకున్న పరిజ్ఞానంతో హితబోధ చేసింది. కానీ తనకు తెలియ కుండానే కూతురు కాపురం కూలగొడుతున్న సంగతి ఆమెకు తెలియదు.

ఇలాంటి తల్లిదండ్రులు ఎంతమంది వున్నారో?! అనిపించింది.